పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు

సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి

పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి అనురాధ తెలిపారు.సోమవారం రోజున పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 27న జరగబోయే పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలతో పాటు 23 లొకేషన్లు ఏర్పాటు చేశామని మొత్తం 67 పోలింగ్ స్టేషన్‌లలో ముగ్గురు ఏసిపిలు,10 మంది సిఐలు,27 మంది ఎస్ఐలుఏఎస్ఐ హెడ్ కానిస్టేబుల్లు 67,312 మంది కానిస్టేబుల్‌లతో మొత్తం 419 మంది అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎన్నికలు పూర్తయే వరకు జిల్లా వ్యాప్తంగా బిఎన్ఎస్ఎస్ 163 ,2023 సెక్షన్ అమలులో ఉంటుందని ఈ సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద 5గురి కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండకూడదని,పార్టీల జెండాలతో కూడిన ప్లకార్డ్స్ పట్టుకోకూడదని,బైకులు,లౌడ్ స్పీకర్లు, ధర్నాలు, రాస్తారోఖోలు ఊరేగింపులు నిర్వహించడం నేరంగా పరిగనలోకి తీసుకోవడంతో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కిరాణా దుకాణాలను తనిఖీలు చేసిన పోలీసులు

ధూళిమిట్ట (మద్దూరు),ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : మద్దూరులోని కిరాణా దుకాణాలు,హోటళ్లతో పాటు అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కటిక్స్ డాగ్స్‌తో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత తాత్కాలిక ఆనందం కోసం తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైన మత్తుపదార్థాలు అమ్మినా, కొన్న పోలీస్‌స్టేషన్‌కు లేదా 100కు కాని డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో మద్దూరు పోలీస్ సిబ్బంది, డాగ్‌స్కాడ్ సిబ్బంది, కానిస్టేబుల్లు అజయ్‌కుమార్, శ్యామ్ సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నార్కటిక్స్ డాగ్స్‌తో కిరాణా దుకాణాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

పోలింగ్ తీరుని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు

సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఈనెల 27వ జరగనున్న గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఎంతమంది ఓటర్లు దరఖాస్తు చేసుకున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం 12 ద్వారా 74 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేశారని పోస్టల్ బ్యాలెట్ పేపర్ నోడల్ అధికారి బాలరాజు తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారిలో 8 మహిళలు, 66 మంది పురుష ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని అనుసరించి శాసనమండలి ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్స్ ఎన్నికలలో ఎన్నికల విధులలో ఓటు హక్కు వినియోగించుకోలేని ఉద్యోగులసౌకర్యార్థం ఈ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఎన్నికల సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

సివిల్ సర్వెంట్లకు కలెక్టర్ అతిథి ఉపన్యాసం

వివిధ దేశాల సివిల్ సర్వెంట్లకు అతిథి ఉపన్యాసాన్ని ఇస్తున్న కలెక్టర్

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరిలోని నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అకాడమిలో వివిధ దేశాల సివిల్ సర్వీస్ అధికారులకు అతిథి ఉపన్యాసం చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ) ఆధ్వర్యంలో సౌత్ ఈస్ట్ ఆసియా, ఇండియన్ ఓసియన్ రీజన్‌కు సంబంధించిన దేశాల సివిల్ సర్వెంట్స్‌కు స్థానిక పాలనలో సామర్థ్యాల పెంపు అనే అంశంపై శిక్షణను ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను ఆహ్వానించి స్థానిక పాలనలో సమర్థ్యాల పెంపుపై వివిధ దేశాల సివిల్ సర్వెంట్లకు అతిథి ఉపన్యాసాన్ని ఇప్పించడం జరిగింది. ఈ సంధ్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ రాష్ట్రంలో అమలవుతున్న స్థానిక పాలనపై సుదీర్ఘంగా తన అనుభవాలను పంచుకోవడం జరిగిందన్నారు. ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. వాళ్లందరికీ కొన్ని విలువైన సలహాలు, సూచనలు చేయడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం కూడా జిల్లా కలెక్టర్ బంగ్లాదేశ్ స్థాయి సివిల్ సర్వీస్ అధికారులకు ఢిల్లీలో, ట్రైనీ సివిల్ సర్వీసు అధికారులకు ముస్సోరి ఐఏఎస్ అకాడమీలో అతిథి ఉపన్యాసం ఇస్తూ తన అనుభవాలను పంచుకోవడం జరిగిందని తెలిపారు.

మహిళా సాధికారతపై వారోత్సవాలు

-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా సాధికారతపై ఫిబ్రవరి 24వ తేదీ నుండి 28వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఆర్థిక ప్రణాళిక, పొదుపు నష్ట నివారణ చర్యలు, ఆర్థిక పరిపుష్టికి రుణాలు పొందడం, గృహ రుణాలు, ఉద్యోగినీలకు, స్వయం ఉపాధి పొందాలనే మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాల ట్రాన్స్ ఉమెన్స్‌కి, దివ్యాంగులకోసం ప్రత్యేక క్యాంపు నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఫిబ్రవరి 25న జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించడం జరుగుతుందని, ఇందులో మహిళా సంఘాలతోపాటు కళాశాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.కార్యక్రమాన్ని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.

ఖేడ్ యువకుడికి బంగారు పతకం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మారుమూల ప్రాంతానికి చెందిన రాములుయాదవ్ లాంగ్‌జంప్‌పోటీల్లో బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని జింఖాన మైదానంలో నిర్వహించిన తెలంగాణ మాస్టర్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న రాములు యాదవ్ బండారు పతకాన్ని అందుకున్నారు. 2వందలు, 4 వందల మీటర్ల పరుగు పెందెంలో రాములు యాదవ్ రజిత పతకాన్ని సొంతం చేసుకున్నారు.బంగారు పతకాన్ని అందుకున్న రాములుయాదవ్ కల్హేర్ మండలం కృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీటీగా విధులు నిర్వహిస్తున్నారు. విజేత రాములు యాదవ్‌కు రాష్ట్ర మంత్రి కొండా సురేష్ బంగారు పతకాన్ని అందించి అభినందించారు.

పాట్లపల్లి జాతరకు ప్రత్యేక బస్సులు : డిఎం

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త : మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పొట్లపల్లి శ్రీ స్వయంభు రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయంలో జరిగే జాతరకు హుస్నాబాద్ డిపో నుండి ప్రత్యేక బస్సులు నడిపించున్నట్లు హుస్నాబాద్ డిపో మేనేజరు వెంకటేశ్వర్లు సోమవారం రోజున ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో జాతరకు వెల్లే ప్రయాణికులు ఈ బస్సులను వినియోగించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి..పిఒలు, ఎపిఓలు, ఒపిఓలు, తహసీల్దార్‌లకు శిక్షణలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

సంగారెడ్డి బ్యూరో, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: శాసనమండలి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలు, తహసీల్దార్‌లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను నిర్వహించాలన్నారు. ఓటింగ్ గోప్యతను ఖచ్చితం గా అమలయ్యేలా చూడాలని, ఎన్నికలరోజు ముందు (ఈ నెల 26న) ఉదయం 9 గంటలకు జిల్లాలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి సకాలం లో చేరుకొని, తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని సరిచూసుకొని, ఆయా పోలింగ్ కేంద్రా లకు చేరుకోవాలన్నారు. ఎన్నికల సంఘం గుర్తిం చిన 14 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని ఓటరు ఓటు వేయడానికి తమ వెంట తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. ఈ గుర్తింపు కార్డులలోని చివరి 4 అంకెలను సంబంధిత ఫార్మ్ లో అధికారులు నమోదు చేయాలన్నారు. మొదటగా ఓటరు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించగానే ఓటరు వివరాలను సరిపోల్చి ఎడమచేతి చూపుడు వేలుకు సిరాను పూయాలన్నారు. అంధులు, ఆసక్తులు ఓటర్లకు సంబంధించి 18 సంవత్సరాలు నిండిన వారిని సహాయకులుగా ఓటు వేయడానికి అనుమతించాలన్నారు. వీరికి సాధారణానికి భిన్నంగా కుడి చేతి చూపుడు వేలుకి సిరాను రాయలన్నారు. వీరి నుంచి సంబంధిత ధృవీకరణను తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రారంభం కాగానే ప్రతి రెండు గంటలకోసారి నమోదైన ఓటింగ్ వివరాలను పై అధికారులకు అందజేయాలన్నారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సామగ్రిని జాగ్రత్తగా నిర్ధేశిత ప్రదేశాలకు చేర్చాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరిస్తూ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ ఏజెంట్‌లను ఫార్మ్ 10 ద్వారా పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించాలని, ఫార్మ్ 16, పేపర్ సీల్ అకౌంట్, పీఓ డైరీలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా నమోదు చేయాలని, బ్యాలెట్ బాక్స్ సీలింగ్ అనేది అత్యంత ప్రాధాన్యమైందని, సీలింగ్ విధానాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తామని వెల్లడించారు. పీఓ ఇచ్చిన వాయిలెట్ పెన్‌కాకుండా ఇతర రంగుల పెన్నులు వాడితే బ్యాలెట్ చెల్లుబాటు కాదని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకు ముందు ఎన్నికలకు ముందు, పోలింగ్ సమయంలో, పోల్ తర్వాత నిర్వహించవలసిన విధులపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెం టేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. పోలింగ్ ప్రక్రియకు వినియోగించే బ్యాలెట్ బాక్సులు, అన్ని రకాల ఫార్మ్‌లతో పాటు నమూనా ఓటింగ్ ప్రక్రియను వివరించి, వారిచే సాధన చేయించి, అవగాహన కల్పించారు. అనంతరం అధికారుల సందేహాలను మాస్టర్ ట్రైనర్ తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి నివృత్తి చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు, తహసీల్దార్‌లు, ఎన్నికల విభాగం సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేష్

జాతర పనులు-మాయమవుతున్న నిధులు

వృధా అవుతున్న కోట్ల రూపాయలు
మూడు రోజుల్లోనే కోట్లు మాయం
మట్టిరోడ్లతో మట్టిలో కలుస్తున్న నిధులు
కాంట్రాక్టర్‌లకు అధికారులకు వరంగా జాతర నిధులు

పాపన్నపేట, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మహాశివరాత్రి సందర్భంగా ఏడుపాయల వనదుర్గా భవాని మాత క్షేత్రంలో ప్రతి సంవత్సరం నిర్వహించే మహాజాతర భక్తులకు ఆనందోత్సాహాలు కలిగిస్తుంటే పలు శాఖల అధికారులకు, కాంట్రాక్టర్లకు కాసుల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం జాతర ఏర్పాట్లకు విడుదల చేసే నిధులతో తాత్కాలిక పనులు చేపడుతుండటంతో మూడు రోజుల్లోనే మంజూరైన నిధులు మాయమవుతున్నాయి. తాత్కాలిక పైప్‌లైన్లు ఏర్పాటు చేయడం, నీటి సరఫరాకు మోటార్లు కొనుగోలు చేయడం, షామియానాలు అద్దెకు తీసుకురావడం, తాత్కాలిక బారికేడ్లు ఏర్పాటు చేయడంలాంటివి కాంట్రాక్టర్ పాలిటవరంగా మారుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన ఫైడ్లైన్ మినహా ఇప్పటివరకు భక్తుల సౌకర్యార్థం నీటి సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాత్కాలిక మరుగుదొడ్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురాకుండా జాతర సమయంలో వాటిని వినియోగించుకుని అనంతరం పట్టించుకోకపోతుండటంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

ప్రతి ఏటా తాత్కాలిక పైప్‌లైన్...

మూడు రోజులపాటు వనదుర్గా మాత సన్నిధిలో కనుల పండువగా నిర్వహించే మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో తాగునీటి కొరత రాకుండా ప్రతి సంవత్సరం ఫైడ్లైన్ ద్వార నీటి సరఫరాను లక్షలు వ్యయం చేసి పైప్‌లైన్‌తో పాటు మోటారను కొనుగోలు చేసి నీటిని అందచేస్తున్నారు. జాతర ముగిసాక పైప్‌లైన్‌లతో పాటు మోటార్లను భద్రపరిచేందుకు ప్రత్యేక గది ఉన్నప్పటికీ ఆ పైప్‌లైన్, మోటార్లు ఎక్కడికి మాయం అవతున్నాయో అంతు చిక్కడంలేదు. ప్రతి సంవత్సరం జాతర సమయంలో వాటిని కొనుగోలు చేసినట్లు చూపిస్తూ నిధులను మింగేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల జనవరి మాసంలో నిర్వహించిన మాఘ అమావాస్య జాతర సందర్భంగా పాత మోటార్లను బిగించి నీటిని సరఫరా చేశారు.

షామియానాల అద్దెలతో లక్షలు వృధా...

ఆలయ ప్రధాన మండపం నుంచి రాజగోపురం వరకు అద్దెకు తీసుకోచ్చిన షామియానాలతో లక్షలు వృధా చేస్తున్నారు. షామియానాలు వేసేందుకు లక్షల రూపాయలకు టెండర్లు కేటాయిస్తారు. లక్షలు వెచ్చించి షామియానాలు తీసుకురావడం కన్నా పోల్ ఫిటింగ్ చేపడితే వరదల సమయం మినహా మిగతా రోజుల్లో భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయని చెప్పడం అతిశయోక్తి కాదు.

బారికేడ్ల పేరుతో దోపిడీ...

అమ్మవారిని దర్శించుకునేందుకు 3 రోజుల పాటు ఏర్పాటు చేసే బారికేడ్లు తాత్కాలికం కావడంతో కాంట్రాక్టర్‌కు జాతర నిధులు వరంగా మారుతున్నాయి. కట్టెలతో తాత్కాలికంగా ఏర్పాటు చేసే బారికేడ్ల టెండర్ల రూపంలో నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

శాశ్వత పనులకు సుస్తీ...

జాతరను పురస్కరించుకుని విడుదల చేసే ఎస్‌డిఎఫ్ నిధులు మూడు రోజుల్లోనే మాయమవుతున్నాయి. జాతరను పురష్కరించుకుని తాత్కాలిక పనులు చేపడుతుండటంతో లక్షల నిధులు వృధా అవుతున్నాయి. గతంలో కలెక్టర్‌గా విధులు నిర్వహించిన రోనాల్డ్‌రోస్ ప్రత్యేక చొరవ తీసుకుని నీటి సరఫరాకు శాశ్వత పైప్‌లైన్‌తో పాటు మరుగుదొడ్లను, నల్లాలను ఏర్పాటుచేయించారు. శాశ్వతంగా ఏర్పాటు చేసినా వాటిని వినియోగంలోకి తీసుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి జాతరకు విడుదల అవతున్న నిధులు వృధా కాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు సూచిస్తున్నారు.

తలుపులు లేని మరుగుదొడ్లు, నీటి కొళాయి వద్ద నల్లాలు లేని దృశ్యం

సంగారెడ్డిమున్సిపాలిటీ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త:

రంజాన్ మాసంలో ముస్లింలు ఇబ్బందులు పడకుండా

ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

జిల్లా అధికారులతో కలెక్టర్ ఎస్పీల సమీక్ష సమావేశంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి

రంజాన్ ఉపవాస దీక్షలు మార్చి 2 నుండి ప్రారంభం కానున్న దృష్ట్యా ముస్లింలు ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ రూపేష్, ముస్లిం పెద్దలు, జిల్లా అధికారులతో కలిసి రంజాన్‌మాసం ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ముందుగా మత పెద్దలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఈద్గాలు మసీదులు ఉన్న ప్రాంతాలలో వెంటనే శానిటేషన్ పనులు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలులో తాగునీటి సమస్య తలెత్తకుండా గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లకు వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈద్గాలు, మసీదులు ఉన్న ప్రాంతాలలో శానిటేషన్ సమస్య తలెత్తకుండా అవసరమైన రకాల చర్యలు చేపట్టాలన్నారు.పైపులైన్ మరమత్తులు ఉంటె అట్టి విషయాన్ని ప్రజలకు ముందుగా తెలియజేయాలని మిషన్ భగీరథ్ అధికారులను, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. వంటగ్యాస్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. ఈద్గాలు,మసీదు ప్రాంతాలను శుభ్రపరచాలని రాత్రి సమయాలలో వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవసరమైన నిఘా ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటన జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఇఫ్తార్ విందులు జరిగే ప్రదేశాలలో శానిటేషన్ సమస్య తలెత్తకుండా పెద్ద డస్ట్ బిన్లను ఏర్పాటుచేసి వెంటనే చెత్తను తొలగించేలా మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ రూపేష్, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, జడ్పీసీఈఓ జానకిరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దేవుజా, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, ముస్లిం మతపెద్దలు జిల్లాలోని ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

ఫౌల్ట్రీ ఫాంను శుభ్రం చేస్తున్న కార్మికులు

వార్త ప్రభావం

కోళ్ల ఫాంను సందర్శించిన జెడి

-ఇంకా బర్డ్‌ఫ్లూ నివేదిక రాలేదు

చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని తాడ్డానిపల్లి గ్రాహ శివారులోని టోల్‌ప్లాజా వద్ద గల కోళ్ల ఫాంను జిల్లా పరిశుసంవర్ధక శాఖ ఎం వసంతకుమారి సందర్శించారు. సోమవారం కోళ్ల ఫారంలో ఏకంగా 9 వందల కోళ్లు మృతి చెందినట్లు ప్రభాతవార్త కథనం ప్రచురించడంతో స్పందించిన జేఈ వసంతకుమారి తాడ్డాన్‌పల్లికి చేరుకుని కోళ్ల ఫాంను పరిశీలించి కార్మికులకు ఫాంను శుభ్రం చేయించారు. మృతి చెందిన కోళ్లను గంతులు తీసి పూడ్చేసినట్లు అధికారి పేర్కొన్నారు. మృతి చెందిన కోళ్ల శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపామని, ఇంకా నివేదిక రాలేదని గుర్తు చేశారు. ఆరో ఆరు నెలల వరకుఫౌల్ట్రీ ఫాంలో కోళ్లను పెంచవద్దని బాధిత రైతుకు సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి విశాల్‌కుమార్ ఉన్నారు.

ఒకే కాన్పులో ముగ్గురికి జన్మనిచ్చిన మహిళ

-గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణరావు

ఒకే కాన్పులో జన్మించిన ముగ్గురు శిశువులను చూపుతున్న వైద్యులు

గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త): తన ప్రాణాన్ని పనంగా పెట్టి పండంటి ముగ్గురు బిడ్డలకు ఓ మహిళ జన్మనిచ్చిన సంఘటన గజ్వేల్‌లోని జిల్లా ప్రభుత్వాసుపత్రిలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ములుగు మండలం అడవిమజీద్ గ్రామానికి చెందిన నాగరత్నకు నర్సింలు అనే వ్యక్తితో వివాహమై ఏడు సంవత్సరాలు అవుతున్నా సంతానం లేదని బాధపడుతున్న సమయంలో ఏకంగా ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు (ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడబిడ్డ)కు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణరావు మాట్లాడుతూ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ముగ్గురు పిల్లలతో పాటు తల్లి సురక్షితంగా ఉన్నారని తెలిపారు. ఇందుకు కృషి చేసిన డాక్టర్ మంజుల, డాక్టర్ త్రివేణి, అనస్తీషియా సుశీల, అప్రోజ్, ఓటి సిబ్బందిని అభినందించారు.

సిద్ధిగణపతి దేవాలయంలో

మహాశివరాత్రి ఏర్పాట్లు : ఇవో లావణ్య

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి దేవస్థానంలో మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని శివాలయంలో ప్రత్యేక అభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సోమవారం గణేష్ దేవస్థానం ఈఓ ఎన్.లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా ప్రత్యేక అలంకరణ మధ్యాహ్నం అన్న సంతర్పణ, లోక కళ్యాణార్థం సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం జరుపబడునని తెలిపారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదం వితరణ జరుపబడుతుందని చెప్పారు. అలాగే దాతలు సహాయంతో గణేష్ దేవస్థానంలో వేదిక నిర్మాణం, కౌంటర్స్ నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ బాబు ఆదేశాలు మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, వైద్యం, అన్నసంతర్పణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఈఓ కోరారు.

మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలిస్తున్న గణేష్ దేవస్థానం ఈఓ లావణ్య

ఎటిఎంలో చోరీకి విఫలయత్నం

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : పట్టణంలోని ఓ ఏటిఎంలో చోరీకి విఫలయత్నం జరిగిందని ఎస్ఐ బి.లింగం తెలిపారు. నర్సాపూర్ పట్టణంలోని గోల్డెన్ చికెన్ సెంటర్ పక్కనగల యాక్సిస్ బ్యాంక్ ఎటిఎంలో ఈనెల 23వ తేదీ ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీ చేయడానికి విఫలయత్నం చేశారని తెలిపారు. ఏటీఎం మెషిన్‌ని ధ్వంసం చేసి డబ్బులు దొంగలించడానికి ప్రయత్నం చేశారని చెప్పారు. వారు ఎం

పేద ప్రజలకు ఎంతో మేలు : ఎమ్మెల్యే తలసాని

మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిభిరంలో వైద్య పరిక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలసాని.

బేగంపేట ఫిభ్రవరి 24,ప్రభాతవార్త

ఉచిత వైద్య శిభిరాలతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సోమవారం రాంగోపాల్‌పేట డివిజన్ కుర్మ బస్తీలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య పరిక్ష శిభిరాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రారంభించారు. ఈశిభిరంలో ఎమ్మెల్యే తలసాని బీపీ పరిక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు అధికంగా నివసించే బస్తీలలో నిర్వహించే ఉచిత వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం ప్రింటర్స్‌డే సందర్భంగా ఉచిత వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేస్తున్న నిర్వహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్, అరుణా గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కిషోర్‌కుమార్, నాగులు, పబ్బా ప్రకాష్, చంద్రప్రకాష్, మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు జలంధర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళలు క్రీడల్లో పాల్గొనడం అవసరం

క్రీడల్లో పాల్గొన్న పెన్షనర్స్ మహిళలు. చిత్రంలో శివసేనరెడ్డి, శోభారాణి, ఉమాదేవి తదితరులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్‌కు ఆటల పోటీలు ఉత్సహంగా సోమవారం ఎల్‌బి స్టేడియంలో జరిగాయి. ఈ పోటీలను తెలంగాణ ఉమెన్ కో-ఆపరేటివ్ డవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ బండ్రు శోభారాణితో కలిసి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ శివసేనరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలలో ఫాస్ట్ వాక్, మ్యూజికల్ ఛైర్, స్పీడ్ రన్నింగ్ జరిగాయి. ఈ సందర్భంగా శివసేనరెడ్డి మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా క్రీడల్లో మహిళలు పాల్గొనడం ఆరోగ్యానికి దోహదపడుతుందన్నారు. విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్ క్రీడల్లో క్రియాశీలకంగా పాల్గొనడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా పెన్షనర్స్ ఫోరం ఛైర్ పర్సన్ ఆర్.ఉమాదేవి, కోర్ ఛైర్ పర్సన్ కె.ధనలక్ష్మి, కన్వీనర్ ఎస్ఎం ఎల్ నాగమాంబ, జూపాక సుభద్ర, పెన్షనర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మయ్య, పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు సుధాకర్ పాల్గొన్నారు.

బిసి పాలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో పారిశ్రామిక విభాగం ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న యుగంధర్‌గౌడ్

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: బిసి పారిశ్రామిక వేత్తలను ఒకే తాటిపైకి తీసుకు వచ్చేందుకు బిసి పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో పారిశ్రామిక విభాగాన్ని ఏర్పాటు చేశామని రాష్ట్ర జెఎసి ఛైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ తెలిపారు. బిసిలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఈ విభాగం పనిచేస్తుందని, రాష్ట్ర అధ్యక్షునిగా దామోదరచారిని అయన నియమించి, నియామకపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న రాయితీలు, రిజర్వేషన్‌లు బిసి పారిశ్రామిక వేత్తలకు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడంతోపాటు ఆర్థికంగా అభివృద్ధి చెస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిందని సందర్భంగా గుర్తు చేశారు. బిసి పారిశ్రామిక వేత్తలు బసి యువతకు ఉపాధి కల్పించాలని, కోరారు. ఈ సమావేశంలో కాప్రా స్మాల్ స్కేల్ ఇండ స్ట్రీస్ అధ్యక్షుడు యాదయ్య, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శి హీరాలాల్, సభ్యులు బలు, కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి

దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సమావేశమైన జిఎం.అరుణ్‌కుమార్ జైన్

కంటోన్మెంట్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రైల్వే కార్యకలాపాలలో భద్రతను నిర్ధారించడానికి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ సూచించారు. సోమవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో వివిధ జోన్లకు సంబంధించిన రైల్ కార్యకలాపాల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సేఫ్టీ డ్రైవ్ స్థితిని ఆయన పరిశీలించారు. ఏమైన లోపాలు ఉంటే వీలైనంత త్వరగా సరి చేసుకోవాలన్నారు. లోక్‌ఫైలెట్లు, అసిసెంట్ లోకో ఫైలెట్లు, గార్డులు, ట్రాక్ మిషన్ ఆపరేటర్లు, టవర్ వ్యాగన్ ఆపరేటర్లు, భద్రతా సిబ్బందికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలన్నారు. రైళ్ల నిర్వాహనలో భద్రతను నిర్ధారించడానికి విధి విధానాలను పాటించాలన్నారు. పొగను నిర్ధారించ పరికరాలు, అగ్నిమాపక యంత్రాలు, అగ్ని నిరోధక భద్రత వస్తువుల స్టాక్ నిల్వ స్థానాన్ని కూడా పరిశీలించాలన్నారు. సిబ్బందికి సరైన విశ్రాంతి ఇవ్వడానికి ప్రణాళిక చేయాలని డి.ఆర్.ఎం.లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగర్వాల్‌తో పాటు హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూర్, నాందేడ్ డివిజన్ల డిఆర్ఎంలు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలో అలీజా బుఖారీకి ప్రథమ స్థానం

చార్మినార్,ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : మదీనా సమీపంలోని మహ్మద్ క్యాప్ మార్ట్ ఎండి మహ్మద్ ఇలియాస్ బుఖారీ మనమరాలు అలీజా బుఖారీ (గ్రేడ్2సి) ఖాజాగూడ ఓక్రిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఫెస్ట్ (2024-25) సందర్భంగా నిర్వహించిన స్కేటింగ్ పోటిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహ్మద్ ఇలియాస్ బుఖారీ మాట్లాడుతూ తన కొడుకు ఇషాక్ బుఖారి కూతురు అలీజా బుఖారీ స్కేటింగ్ పోటిలో ప్రథమ స్థానాన్ని దక్కించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

విఎన్ఆర్ విజేఐఈటిలో ముగిసిన సాంకేతికోత్సవం కన్వర్జెన్స్ 2K25

నిజాంపేట్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త

ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణంలో కన్వర్జెన్స్ 2K25 పేరిట వార్షిక సాంకేతికోత్సవం ముగిసింది. ఈ వేడుక ముగింపు సభలో ముఖ్య అతిథిగా టిసిఎస్ సంస్థలో ప్రధాన కన్సల్టెంట్, డిజిటల్ ఉపక్రమణాల సాంకేతికత అధిపతి పెద్దిగారి బాలప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికతాభివృద్ధి అతి వేగంగా రూపాంతరం చెందుతున్న కాలమిదని, విద్యాసంస్థలు తమ విద్యార్థులను, అధ్యాపకులను కూడా ఈ పెనుమార్పులను అందుకునేలా సన్నద్ధం చేయవలసిన అవసరముందని అన్నారు. కన్వర్జెన్స్ వేడుకను పేరుకు తగినట్టుగా వివిధ సాంకేతికతల కలయికకు వేదికగా 25 యేళ్ళకి పైగా నిర్వహిస్తున్నందుకు విఎన్ఆర్ విజేఐఈటీ యాజమాన్యాన్ని, విద్యార్థులను, నిర్వాహకులను ఆయన అభినందించారు. విద్యార్థి పురోగతి డీన్ ఆచార్య డా.వై. పద్మశాయి మాట్లాడుతూ వివిధ కార్యశాలలు, హ్యాకథాన్, క్యాడథాన్, కోడింగ్ కాంటెస్ట్, ప్రాజెక్ట్ కాంటెస్ట్, క్యాంపస్ ఆటోమేషన్, సరదా పోటీలు, సమాజహిత కార్యక్రమాల వంటి వివిధాంశాల సమాహారంగా జరిగిన రెండు రోజుల టెక్నికల్ సింపోజియంలో నగరంలోని వివిధ కళాశాలల నుంచే కాక ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక నుంచి కూడా విద్యార్థులు వచ్చి పాల్గొన్నారని తెలిపారు. తదనంతరం కళాశాల ప్రధానాధ్యాపకులు ఆచార్య డా. సి.డి. నాయుడు మాట్లాడుతూ ఈ వేడుకలు అందించిన ప్రేరణ

సాంకేతికోత్సవం కన్వర్జెన్స్ 2K25లో పాల్గొన్న విద్యార్థులు

తో విద్యార్థులు ఈ రెండు రోజుల్లో రూపొందించిన సృజనాత్మక సాంకేతిక పరిష్కారాలను కళాశాలలోని పరిశోధన, నవకల్పన కేంద్రాల ద్వారా మరింత అభివృద్ధి చేసి విజ్ఞాన జ్యోతి నుంచి మూలధనంతో అంకురసంస్థలుగా రూపొందించవచ్చని అన్నారు, ఇదే ప్రాంగణంలో ఉన్న విజే హబ్ ద్వారా వచ్చే సహకారంతో విద్యార్థులు స్టార్టప్ సమారంభకులుగా ఎదగవచ్చని ప్రోత్సహించారు. మొదటి సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనటం ముదావహమన్నారు. ఈ అవకాశానికి బాటలు వేసిన వారి జిజ్ఞాస ఒక విత్తనంగా మొలకెత్తి, పచ్చని భవిష్యత్తుకు చిగురు తొడగనుందని కళాశాల సంచాలకులు ఆచార్య డా. బి. చెన్నకేశవరావు ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. కన్వర్జెన్స్ 2K25 ముగింపు వేడుకల్లో కళాశాలకి చెందిన విద్యార్థి కూటములు క్రెసెండో, లైవ్వెర్ తమ సంగీత నృత్య ప్రదర్శనలతో ఆహూతులను అలరించాయి.

హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలి : ఎమ్మెల్యే తలసాని

కంటోన్మెంట్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్తః

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలో అన్ని సౌకర్యాలతో కూడిన నూతన హాస్పిటల్ నిర్మించాల్సిన అవసరం ఉన్నదని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం సనత్‌నగర్‌లో పర్యటించిన సందర్భంగా ఎస్ఆర్‌టీలో ఉన్న డిస్పెన్సరీకి వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకు తగిన విధంగా సౌకర్యాలు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తికి ఫోన్ చేసి డిస్పెన్సరీకి పక్కనే జీహెచ్ఎంసీకి చెందిన స్థలం ఉన్నదని, ఆ స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖకు కేటాయించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. హాస్పిటల్ భవన నిర్మాణం కు అవసరమైన నిధులు 1.43 కోట్ల రూపాయలు ఇప్పటికే మంజూరై ఉన్నాయని వివరించారు. నూతన హాస్పిటల్ భవనం నిర్మిస్తే మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకట్, ఎంఈఓ హరిచంద్ర, కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ, బాల్ రెడ్డి, వాటర్ వర్క్స్ జీఎం హరి శంకర్, ఎఎంఓహెచ్ చంద్రశేఖర్ రెడ్డి, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారి, నాయకులు ఖలీల్, సురేష్ గౌడ్, శేఖర్, ఫాజిల్, జమీర్, పుష్పాలత ఉన్నారు.

సెల్ టవర్ తొలగించాలి....

సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీ 707లో నూతనంగా ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ టవర్‌ను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కోరారు. సోమవారం సనత్‌నగర్ పర్యటనకు వచ్చిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.

తాము మొదటి నుండి కోరుతున్నా అధికారులు పట్టించుకోకుండా సెల్ ఫోన్ టవర్‌ను ఏర్పాటు చేశారని, దీని వలన తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి టవర్ తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు పకడ్బందీ బందోబస్తు

-బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
-సిపి సుధీర్ బాబు

నేరేడ్ మెట్, రాచకొండ కమిషనరేట్, ఫిబ్రవరి 24ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కీసరగుట్ట బ్రహ్మోత్సావాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగేందుకు తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలు మరియు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్ల గురించి రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ గారు బందోబస్తు విధుల్లో ఉన్న సివిల్, ట్రాఫిక్ మరియు ఇతర విభాగాల అధికారులు మరియు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గారు మాట్లాడుతూ బ్రహ్మోత్సావాల సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండడం వల్ల భద్రతా పరమైన పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, విఐపీలతో పాటు సాధారణ భక్తులకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు మరియు సిబ్బంది తమకు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని, బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యబృందం అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజల సౌకర్యార్థం డాక్టర్ల బృందంతో పాటు అంబులెన్సును, బీపీ షుగర్ వంటి వాటితో పాటు ఇతర అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు.

భక్తులతో పాటు బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది యొక్క క్షేమం కూడా తమకు అంతే ముఖ్యమని, పోలీసు సిబ్బంది అనుకోని పరిస్థితుల్లో అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ప్రత్యేక వైద్య చికిత్స తీసుకుంటున్న సిబ్బందికి అవసరమయ్యే మందులు కూడా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరుతో పాటు వేసవి తాపానికి కొందరు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది కాబట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పారిశుధ్య ఏర్పాట్లు సక్రమంగా ఉండాలని, మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ ప్రాంగణంలో అన్ని వైపులా ఏర్పాటు చేసిన సిసిటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఉండాలని, మహిళా భక్తుల రక్షణ కోసం షీ టీం బృందాలు కూడా విధుల్లో ఉండాలని పేర్కొన్నారు. భారీసంఖ్యలో భక్తులు దైవదర్శనం కోసం వచ్చే అవకాశం ఉంది కాబట్టి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి డిసిపి పివి పద్మజ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, ఐటి సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈశ్వరీబాయి సేవలు మరువలేనివని

ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు ఈశ్వరీబాయి స్మారక అవార్డును ప్రదానం చేస్తున్న ప్రముఖులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: నిరుపేద కుటుంబంలో జన్మించిన మాజీ శాసన సభ్యురాలు, ఆర్‌పిఐ మాజీ అధ్యక్షురాలు, దళిత మహిళా నేత జె.ఈశ్వరీబాయి దళితులు, నిరుపేదల కోసం ఎంతో కృషి చేశారని పలువురు వక్తలు కొనియాడారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్వంలో సోమవారం రవీంద్రభారతిలో జరిగిన జె.ఈశ్వరీబాయి 34వ వర్ధంతి సభలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఛైర్ పర్సన్ అలేఖ్య పుంజాల, తెలంగాణ సాంస్కృతిక సారథి ఛైర్ పర్సన్ వెన్నెల గద్దర్, విశ్రాంత ఉన్నతాధికారి పి.ఎస్.ఎన్. మూర్తి, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ, దళిత సేన జాతీయ అధ్యక్షుడు జె.బి.రాజు ప్రసంగించారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ స్ఫూర్తితో రాజకీయాల్లో తనదైన ముద్రవేశారని, ఈశ్వరీబాయి ఫైర్ బ్రాండ్‌గా పేరుగాంచారని వారు చెప్పారు. ఆమె సేవలు అద్భుతమని, నేటితరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. దళితులు, పేదల కోసం ఆనేక పోరాటాలు నిర్వహించారని, తెలంగాణ తొలి ఉద్యమంలో తన వంతు పాత్రను పోషించారని వారు ఈ సంద ర్భంగా గుర్తు చేశారు. అంతకు ముందు ఆమె చిత్రపటానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి స్మారక అవార్డును ప్రముఖ సంఘ సేవకులు ప్రొఫెసర్ లారెన్స్ సైమన్‌కు అతిథులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ జె.గీతారెడ్డి, ట్రస్ట్ వైస్-ఛైర్మన్ డాక్టర్ రామచం ద్రారెడ్డి, పల్లె నాగేశ్వర్, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు గంటా మల్లేష్, ఆర్‌పిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌బాబు, దళిత నేతలు గోల్లపల్లి దయానందరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

-తలకోల పురుషోత్తంరెడ్డి

మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న పురుషోత్తంరెడ్డి, విజయ్‌కుమార్, రాజిరెడ్డి, రేఖారావు తదితరులు

హైదరాబాద్,ఫిబ్రవరి 24,ప్రభాతవార్త:

పటిష్టమైన విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ టీచర్ ఎంఎల్ సి స్వతంత్ర అభ్యర్థి తలకోల పురుషోత్తం రెడ్డిని బారీ మెజార్టీతో గెలిపించాలని పలువురు విద్యావేత్తలు పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్లోని మీడియా సమావేశంలో తలకోల పురుషోత్తం రెడ్డి తన వ్యక్తిగత ఎన్నికల మేనిఫెస్టో 2030 ను విడుదల చేశారు. తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ టీచర్ యూనియన్ మాజీ కార్యదర్శి డా.బి.విజయ కుమార్, డా.ఈ. రాజిరెడ్డి, ప్రొఫెసర్ రేఖా రావు, ఐబిసి ఆర్టర్ ఛైర్మన్ ఏచూరి బాస్కర్, రుద్ర రాజేశ్ మాట్లాడారు. పాత పెన్షన్ పథకం పనరుద్ధరణ. సిపిఎస్ రద్దు పిఆర్ సి ప్రకారం 53శాతం ఫిట్మెంట్ అమలు, డిఎ చెల్లింపు,అవుట్ సోర్స్, ఒప్పంద ఉపాధ్యాయుల ప్రామాణీకరణ, పారదర్శక వర్సిటీ నియామక విధానం. ఆధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతులు, లైబ్రరీల స్థాపితం, ప్రైవేట్ ఉపాధ్యాయ సంక్షే మం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సంక్షేమ బోర్డు ఏర్పాటు, విద్యార్థులకు ఉచిత విద్య ప్రోత్సాహకాలు, నైపణ్యాభివృద్ధి, వృత్తిపరమైన శిక్షణ వంటి అంశాలను ఎజెండాలో పొందుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు.

బండ్లగూడ కార్పొరేషన్ కమిషనర్‌పై ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు

నార్సింగి, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ భవన నిర్మాణందారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని, ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు హరీష్‌గౌడ్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిషోర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా హరీష్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ కమీషనర్ ప్రజల పట్ల అమానూషంగా ప్రవర్తిస్తున్నాడని, ఇష్టానుసారంగా పన్నులు వేస్తున్నాడని, చెరువులు, నాలాలపై భవనాలు నిర్మించేందుకు అనుమతులు ఇస్తున్నాడని ఆరోపించారు. పాలకవర్గ సభ్యుల కాలం ముగిసిన తరువాత కమీష్‌నగర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని, నియంతలా ప్రవర్తిస్తున్నాడన్నారు. ఇలాంటి కమీషనర్, టౌన్‌ప్లానింగ్ టీం అధికారులను వెంటనే విధుల నుంచి తొలగించాలని ప్రిన్సిపాల్ సెక్రెటరీని కోరడం జరిగిందన్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో అనేకమార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా కమీషనర్ పట్టించుకోకుండా అక్రమ నిర్మాణం దారులకే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అడ్డగోలుగా పన్నులు వేయడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కట్టలేక అవస్థలు పడుతున్నారన్నారు. చట్టానికి లోబడి పని

బండ్లగూడ కార్పోరేషన్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రిన్సిపాల్ సెక్రెటరీ దాన కిషోర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్.

చేయాల్సిన కమీషనర్, చట్ట విరుద్ధంగా వెలుస్తున్న నిర్మాణాలకు అండగా నిలుస్తున్నాడని, వారి వద్ద అందిన కాడికి దండుకుంటున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరామని, చర్యలు తీసుకోకుంటే న్యాయస్థానాలను ఆశ్రయిస్తాని హరీష్‌గౌడ్ స్పష్టం చేశారు.

4 రోజులు ఎన్ఎపిఎం మహాసభలు

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సైఫాబాద్, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక (ఎన్ఎపిఎం) 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ నాయకులు మేధావులతో మార్చి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మహాసభలు నిర్వహిస్తున్నామని హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ చెప్పారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రముఖులు వి.సంధ్య, సజయ, మీరా, కన్నెగంటి రవి, విస్సా కిరణ్, వెంకటస్వామి, పవిగా బేగంతో పాటు ఆయన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశంలోని 23 రాష్ట్రాలకు చెందిన మేధావులు, ప్రముఖ జాతీయ నాయకులు హాజరవుతారని చెప్పారు. సహజ వనరులు, ప్రజల హక్కులు, రాజ్యంగ విలువలను కాపాడే విధంగా ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక పోరాడుతుందన్నారు. మిస్ వరల్డ్ పోటీలను నిర్వహించడాన్ని వి.సంధ్య, సజయ పూర్తిగా వ్యతిరేకించారు.

లబ్దిదారులకు షాదీముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

షాదీముబార్ చెక్కును అందజేస్తున్న తాహశీల్దార్ నయూముద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి.

యూసుఫ్‌గూడ ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల కృషి చేస్తుందని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అన్నారు. సోమవారం షాదీముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులను రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు లబ్దిదారులకు సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరామ్, ఖైరతాబాద్ తాహశీల్దార్ నయూముద్దీన్‌లతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి విషేషంగా కృషి చేస్తున్నారని పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

బోరబండ డివిజన్‌లో.....

బోరబండ డివిజన్‌కు చెందిన లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరార్, ఖైరతాబాద్ తహశీల్దార్ నయూముద్దీన్

చంద్రశేఖరశర్మ సిద్ధాంతికి నాగాభరణం అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్త

దాతల సహకారంతో...

వర్గల్ క్షేత్ర అభివృద్ధి మరింత వేగవంతం

వర్గల్, ఫిబ్రవరి 24 (ప్రభాతవార్త): ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర అభివృద్ధికి దాతల సహకారం ఎంతో ఉన్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. క్షేత్రం వద్ద శ్రీవసంత పంచమి మహోత్సవ వేడుకల విజయవంతం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కంచి పీఠం నేతృత్వంలో వర్గల్ క్షేత్రాన్ని గొప్ప ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం కాగా, ఇందుకు అన్ని వర్గాల సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రశాంత, ఆహ్లాద వాతావరణం నెలకొన్న శంభుగిరి కొండలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు కొలువైందని, ప్రతినిత్యం వేలాది మంది భక్తులతో ఆలలారుతోందని అన్నారు. మూడు దశాబ్దాలుగా ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంటుండగా, క్షేత్రం వద్ద నిర్వహిస్తున్న శరన్నవరాత్రి మహోత్సవాలు, శ్రీ వసంత పంచమి, శ్రీ శని త్రయోదశి మహోత్సవం, మూల నక్షత్ర వేడుకలు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రం, శ్రీ సుబ్రహ్మణ్య ఆలయం, శ్రీ చంద్రమౌళీశ్వర క్షేత్రం వద్ద వైభవోపేతంగా వేడుకలను కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్ర నిర్మాణానికి వాసు గ్రూప్స్ చైర్మన్ బెజుగం శ్రీనివాస్‌గుప్త సంపూర్ణ సహకారం అందించగా, అలాగే శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి వారికి నాగభరణం అందించగా, నూతనంగా నిర్మించతలపెట్టిన అన్న ప్రసాద వితరణ సంస్థ ఏర్పాటుకు విరాళం అందించినట్లు సిద్ధాంతి చంద్రశేఖరశర్మ వివరించారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న ప్రొబేషనరీ ఎస్ఐ సౌజన్య

హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హుస్నాబాద్ ప్రొబేషనరీ ఎస్ఐ సౌజన్య అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని నవభారత్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, బాలికలు, మహిళలకు సైబర్ నేరాలు, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, మత్తు పదార్థాలు, ఈవిటీజింగ్‌తో పాటు నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సౌజన్య మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి కూడా విద్యార్థి దిశలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్య సాధనకు ప్రయత్నాలు చేయాలన్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దిశ ముఖ్యమైనదని, ఈ సమయంలో చదువుకు సమయం కేటాయిస్తే భవిష్యత్తులో బాగుపడతారని లేదంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, షీటీమ్ బృంధం సదయ్య, ప్రశాంతి, కృష్ణ అధ్యాపకులు ఉన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

పెద్దచింతకుంట పాఠశాల విద్యార్థినులతో మాస్టర్స్ తదితరులు

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : ఆరోగ్యం, ఆత్మ రక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ ఎంతగానో దోహదపడుతుందని పెద్దచింతకుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి తెలిపారు. ఆదివారం సంగారెడ్డి బాదర్ ఫంక్షన్ హాల్ లో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పెద్దచింతకుంట పాఠశాల మహిళా విద్యార్థులు పాల్గొని 13 గోల్డ్, 2 సిల్వర్ మెడల్స్ సాధించడం పాఠశాలకు ఎంతగానో గర్వకారణమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో వారియన్ మాస్టర్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ పోచయ్య, మాస్టర్ షాధుల్లా, నాగరాజు, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి దర్శించుకున్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరంసోదరుడు గూడెం మధుసూదన్‌రెడ్డి కుమారుడు గూడెం సంతోష్‌రెడ్డి వివాహం సందర్భంగా స్వామి వారి ఆలయంలో తొలి వివాహ పత్రికను అందించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుపతి వెంకన్న ఆశీస్సులతో పటాన్ చెరు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జీఎంఆర్ వెంట ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ ఎంపీటీసీ కొల్కురి రామచంద్రారెడ్డి, గూడెం సందీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'కళాభావన ఆలోచన'

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: ప్రధాన శిక్షకుడిగా ప్రముఖ ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిశాంత్ గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, హైదరాబాద్‌లో కళాభావన ఆలోచనల కళ అనే అంశంపై ఇటీవల నిర్వహించిన రెండు రోజుల కార్యశాల విజయవంతంగా ముగిసినట్టు కార్యక్రమ సమన్వయకర్తలు రమ్య గీతిక, ఏ.సంకీర్తన సోమవారం పేర్కొన్నారు. ఇది విద్యార్థుల సృజనాత్మక ఆలోచన, ప్రభావవంత మైన ఆలోచనల అభివృద్ధిపై అవగాహనను మరింతగా పెంచడానికి రూపొందించినట్టు వారు తెలిపారు. ప్రముఖ ఆర్కిటెక్ట్, అర్బన్ డిజైనర్, నాగపూర్ లోని ప్రియదర్శిని ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఆర్చిటెక్చర్ అండ్ డిజైన్ స్టడీస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిశాంత్ హెచ్ మనాపురే ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారన్నారు. ఆర్కిటెక్చరల్ ప్రాజెక్టులపై అవగాహన ఏర్పరచడానికి, వాటిని విజయవంతంగా పూర్తిచేయడానికి శక్తివంతమైన సాధనంగా ఉన్నతంగా ఆలోచించడం ప్రాముఖ్యతను ప్రొఫెసర్ మనాపురే తొలి రోజు కార్యశాలలో నొక్కి చెప్పినట్టు తెలిపారు. కమ్యూనికేషన్ కళను మెరుగుపరచడంపై దృష్టి సారించి, విద్యార్థులు తమ ఆలోచనలను సమర్థవంతంగా తెలియజేయడానికి వీలు కల్పించిందన్నారు. ఇక రెండవ రోజు, థీసిస్ విద్యార్థుల కోసం రూపొందించిన ఇంటెన్సివ్, యాక్టివిటీఆధారిత సెషన్ అని, ఇందులో ముఖాముఖి చర్చలు నిర్వహించినట్టు తెలియజేశారు. అస్పష్ట ఆలోచనలను ప్రభావవంతమైన భావనలుగా మార్చడంలో ఇది విద్యార్థులకు ఉపకరించిందన్నారు. ఈ ముఖాముఖి విధానం లోతైన అవగాహనను, అర్థవంతమైన మార్పిడిని పెంపొందించిందని, ఇందులో పాల్గొన్న వారందరి ఆసక్తిని రెట్టింపు చేసినట్టు తెలిపారు. ఈ కార్యశాల ఒక పరివర్తనాత్మక అభ్యాస అనుభవంగా నిరూపితమైందని, విద్యార్థులను విమర్శనాత్మక ఆలోచనా నైపుణ్యాలు, ఉచ్చారణలో స్పష్టత, వారి సృజనాత్మక దృక్పథాలను ఆచరణలోకి తీసుకురావడానికి ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం చేసినట్టు కార్యక్రమ సమన్వయకర్తలు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్యారానగర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చొద్దు

సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు

మాట్లాడుతున్న చుక్కా రాములు

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: జనావాసాల మధ్యన డంపింగ్‌యార్డ్ నిర్మాణాలు చేపట్టి ప్యారానగర్‌ను మరో జవహర్‌నగర్‌గా మార్చొద్దని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి, ప్యారానగర్‌లో జిహెచ్ఎంసి ఏర్పాటుచేస్తున్న చెత్త డంపింగ్ యార్డ్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేస్తూ సోమవారం పటాన్‌చెరులోని ఐలాభవన్‌లో సిపిఎంపార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారా నగర్ గ్రామంలో 152 ఎకరాల భూమిలో జిహెచ్ఎంసి పరిధిలో చెత్త వేయడానికి జిహెచ్ఎంసితో రామ్ కి ప్రైవేట్ సంస్థ డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను చేపట్టిందన్నారు. గతంలో దుండిగల్ ఎయిర్ ఫోర్స్ కోసం 1500 ఎకరాలు, డిఆర్డిఏ కోసం 5000 ఎకరాలు భూ సేకరణ చేశారని, ప్రజాభిప్రాయంతో భూ సేకరణ చేయడం జరిగిందని గుర్తు చేశారు. చుట్టుపక్కల ఉన్న రైతులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా గ్రామంలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ కోసం సమావేశం నిర్వహించకుండానే డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ఏ రకంగా సిద్ధపడతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఎలాంటి డంపింగ్ యార్డ్ నిర్మించవద్దని 13 గ్రామ పంచాయతీలలో తీర్మానాలు చేశారన్నారు. విమానాలకు ఇబ్బందులు కలుగుతాయని ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ నిర్మాణం చేపట్టవద్దని దుండిగల్ ఎయిర్ బేస్ కమాండర్ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు లేఖ రాశారని చెప్పారు. డంపింగ్ యార్డ్ ప్రాంతంలో మా భూములు ఉన్నాయని కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించడం జరిగిందని, ఇందులో 750 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దు బందులు చూపాలని అప్పటివరకు ఈ ప్రాంతంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని హైకోర్టు ఉత్తర్వులు సైతం ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ రామ్‌కి, జిహెచ్ఎంసిలు నిర్మాణాలు చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. జిహెచ్ఎంసి చర్యలవల్ల నల్లవల్లి, ప్యార నగర్, కొత్తపల్లి, గుమ్మడిదల, మంబాపూర్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నప్పటికీ పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం వలన చుట్టుపక్క గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారన్నారు. 2019 సంవత్సరంలో జిహెచ్ఎంసి పరిధిలో రోజుకు 35 టన్నుల చెత్త సేకరణ ఉంటే, ప్రస్తుతం రోజుకు 8 టన్నుల చెత్తను సేకరించడం జరుగుతుందని, రాబోయే రోజుల్లో అది 9000 టన్నులకు చేరే అవకాశం ఉందని, డంపింగ్ యార్డ్ ను జనావాసాల మధ్యన కాకుండా వేరే ప్రాంతంలో ఏర్పాటుకు డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డ్ నిర్మాణంతో చెరువులు కుంటలలో ఉన్న నీరు పూర్తిగా కలుషితమయ్యే అవకాశం ఉందని, ప్రజలకు చర్మ అంటూ వ్యాధులు వచ్చి రోగాల బారిన పడే అవకాశం ఉందని, స్వచ్ఛమైన గాలి నీరు, పచ్చని పంట పొలాలు, పశుసంపద నాశనం అవుతుందని వాపోయారు. ప్రజలకు పర్యావరణానికి నష్టం కలిగించే డంపు యార్డును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, ప్యారానగర్ ను మరో జవహర్ నగర్‌గా మారిస్తే సిపిఎం పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రైతులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, ప్రస్తుతం బొంతపల్లి, గుమ్మడిదల నల్లవల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్ పోస్టును వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ సమస్యపై సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఇప్పటికే గుమ్మడిదల నల్లవల్లి గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు మద్దతుగా సిపిఎం పార్టీ నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వందల మందితో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టుకోవడం జరిగిందన్నారు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ఉపసంహరించుకునేంతవరకు ఆందోళనను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ ను రద్దుచేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, మహిళా సంఘం నాయకురాలు లలిత, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య మాట్లాడారు. సిపిఎం పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి బి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, కుమార్, శ్రీనివాస్ గౌడ్, నాగప్రసాద్, వీరారావు, సదాశివరెడ్డి, చంద్ర కిరణ్ సింగ్, కృష్ణ, సునీత, మూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతు పలకండి

మనూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: బిజెపి బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు (ఉపాధ్యాయ, పట్టభద్రుల)లకు ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు పలకాలని సోమవారం మండల కేంద్రమైన మనూర్‌లో బిజెపి నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కరణం ఈశ్వరప్ప, నాయకుఉ రమేష్ పాల్గొన్నారు.

నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి

కొల్చారం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మెదక్-నిజామాబాద్-కరీంనగర్-అదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆల్పోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవన్నగారి శేఖర్, గంగసాని మహేశ్వర్ రెడ్డి, ఆశన్నగారి శ్రీశైలంలు అన్నారు. సోమవారం యూత్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ నమూనాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అల్పోర్స్ నరేందర్ రెడ్డి క్రమ సంఖ్య 2 వద్ద మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, పట్టభద్రుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్, మహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం, జయరాంరెడ్డి, నీరుడి గట్టయ్య, దోమకొండ భూమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు. అలాగే కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుసూదన్ రెడ్డి, వడ్ల లక్ష్మీపతి, అశోక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి

కొల్చారం, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో సోమవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్యలకు మద్దతుగా బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి ఎంచర్ల శేఖర్ యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటింటి తిరుగుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపంచాలని కోరారు. అనంతరం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పేదల సమస్యలపై, ఉద్యోగుల సమస్యలపై, సకలజనుల సమస్యలపై నిరంతరం పోరాడుతుందని, ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు అండగా ఉండే శక్తి కేవలం భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు దుర్గాప్రసాద్, శేఖర్ యాదవ్, ఊశయ్య, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి: వజ్రేశ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: వినియోగదారులకు నాణ్యమైన ఆహారం అందించాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ రోడ్డులో సోమవారం ఆహార విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఇడబ్ల్యుఎస్‌కాలనికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్‌వివిఎం ఫుడ్‌కోర్ట్‌ను వజ్రేశ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈసందర్భంగాఆయనను నిర్వహకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, కీసరగుట్ట డైరక్టర్లు సగ్గ అనిత, సామల అమరేందర్, మాజీ వార్డుసభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బిజెపి ఎమ్మెల్సీల ఎన్నికల ప్రచారం

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త :

ఈ నెల 27న జరగనున్న ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీల ఎన్నికల నేపథ్యంలో సోమవారం బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ ఎన్నికల నర్సాపూర్ మండలం ఇంచార్జ్ పాప గారి రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని నత్నాయపల్లి, కాగజ్ మద్దూర్, కొండాపూర్, కొడిప్యాక, పెద్దమ్మ తండా తదితర గ్రామాల్లో బిజెపి ఎమ్మెల్సీల అభ్యర్థులు పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి కొమరయ్యలను గెలిపించాలని పట్టభద్రులను, ఉపాధ్యాయులను కలిసి బిజెపి నాయకులు ఇంటింటి ప్రచా రాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పాప గారి రమేష్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించినట్లయితే పట్టభద్రులైన నిరుద్యోగుల సమస్యలు, అదేవిధంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంజిరెడ్డి కొమరయ్యలు కృషి చేస్తారన్నారు. అంతేగాక దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో సైతం దేశం ఎంతో అభివృద్ధి చెందుతుం దన్నారు. ఈ మేరకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల నర్సాపూర్ మండల ఇన్చార్జి పాప గారి రమేష్ గౌడ్ తో పాటు బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేష్, ఎస్టి మూర్చ జిల్లా నాయకులు రాములు నాయక్, దాసు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

మాడ్గుల, ఫిబ్రవరి 23 ప్రభాతవార్త:

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ఆర్కపల్లి, మాడుగుల, కొలుకులపల్లి గ్రామాలలోని శివాలయాలు బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతులతో పత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆర్కపల్లికాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామిఆలయంలో ప్రత్యేకకార్యక్రమాలు, శివపార్వతుల కళ్యాణ నిర్వ హిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆకుతోట నరసింహుగుప్తా తెలి పారు. అదేవిధంగా మాడుగుల స్వయంభు శివాలయంలో కళ్యాణో త్సవము నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక చైర్మన్ సూదిని పద్మా రెడ్డి ఒక ప్రకటన తెలిపారు భక్తులు తమ మొక్కులు చెల్లించుకుని శివపార్వతుల దీవెనలు పొందాలని అన్నారు. కాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామి ఆలయంలో మహి ళలకు 300 చీరలను లక్కీడ్రాప్ ద్వారా ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇప్పటికే కరపత్రల ద్వారా పలువురు ప్రముఖులను ఆహ్వానించడం జరిగిందని వారు తెలిపారు. శివపార్వతుల కళ్యాణోత్సవానికి మండలం నుండే కాకుండా వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తగిన ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

కరాటే లో ప్రతిభ చాటిన మందిపాల్ విద్యార్థులు

చౌడపూర్ ఫిబ్రవరి 24 ప్రభాతవార్త :

రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలంలో 23వ తేది ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి కుంగ్‌ఫూ కరాటే ఛాంపియన్ పోటీల్లో, చౌడపూర్ మండలంలోని మందిపల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. హైస్కూల్ నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొని, టోర్నమెంట్లో పటాస్ విభాగంలో ఇద్దరు విద్యార్థినులు సౌజన్య, యశ్విని మొదటి బహుమతిని, తేజశ్రీ, నిహారిక, చరణ్ రెండవ బహుమతిని సాధించారు. గెలుపొందిన విద్యార్థులను, మండల విద్యాధికారి పాఠశాల, ప్రధానోపాధ్యాయులు రాంచందర్, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాల కమిటి చైర్ పర్సన్ యాదమ్మనర్సింలు, ఇంచార్జి యాదయ్య ఉపాధ్యాయులు మురళీధర్, విజయ శ్రావణ్ కుమార్, అనిల్, శ్రీను, జహీర్, సిఆర్పి విజయ్, లక్ష్మన్, గౌతం విద్యార్థులను అభినందించారు

మాట్లాడుతున్న ఎస్‌బిఎన్ మూర్తి

విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి

వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్‌బిఎన్ మూర్తి

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వ వికసాన్ని పెంపొందించుకొని మంచి అలవాట్లను అలవర్చుకొని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్‌బిఎన్ మూర్తి అన్నారు. సోమవారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హైదరాబాద్ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణులు ఎస్‌బిఎన్ మూర్తి పరీక్షల సమయంలో విద్యార్థులు ఏ విధంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌బిఎన్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలో ఎలా ఉత్తీర్ణత సాధించాలి, మంచి మార్కులు ఎలా పొందడం దైనందిక జీవితంలో ప్రతినిత్యం మంచి అలవాట్లను అలవర్చుకోవడం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడంవంటి మెలుకువలను విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ధ్యానం, యోగ ప్రణాళికాబద్ధమైన విషయాంశయా లను విభజన సద్వినియోగం పై విద్యార్థుల అపోహలను నివృత్తి చేయడం, మానసిక ఎదుగుదలకు కావలసిన ప్రయత్నాలు కొనసాగింపు, భయం ,ఆందోళన వంటి వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలన్న విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శేషాచారి, కృషి విజ్ఞాన సంస్థ చైర్మన్ లక్ష్మి కాంతారావు. నాయకులు రాధా కృష్ణాగౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వేణు, ఎంఈఓ తారా సింగ్, కళాశాల అధ్యాపక బృందం, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై బీరప్ప, మల్లన్న స్వాముల ఆశీస్సులు ఉండాలి

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: బీరప్ప, మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలపై ఉండి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీల

మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన పంచలింగేశ్వర ఆలయం

ఉత్సవాలకు ముస్తాబైన పంచలింగేశ్వరస్వామి ఆలయం

మనూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: ఈనెల 26వ తేదీన మహా శివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బాదల్‌గౌవ్ గ్రామంలోని పంచలింగే శ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. 26న ఉదయం 6 గంటల నుంచి గణ పతి గౌరీ పూజ, స్వస్తి పుణ్యాహవచనం, మండపదరణ, శివస్వాములచే సాహూహిక రుద్రాభిషేకం, ఉదయం 9 గంటలకు మంగళహారతి, సాయంత్రం 5 గటలకు అష్టాదశ కలషాలతో 108 మంది దంపతులచే సాహూహిక రుద్రాభిషేకం, రాత్రి 8 గంటలకు కరణ్ మహారాజ్‌చే ప్రవచన కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి నాట్య నందిమ్ చే భారత నాటయం, చిన్నారుల నృత్యాలు, అల్పాహారం వితరణ, మహా మంగళహారతి, రాత్రి 10 గంట లకు సాంస్కృతిక, దర్బార్, భజన కార్యక్రమాలు ఉంటాయ న్నారు. రాత్రి 12.15 నిమిషాలు లింగోద్భవం, మహా మంగళ హారతి, మాల విరమణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 27న భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు ఉంటాయని శివస్వాములు, భక్తులు పేర్కొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డిపో బాధ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి బస్టాండ్ బాధ్యులకు పలు సూచనలు చేశారు. వేసవి కాలం కావడంతో ఎండుల మండుతుంటాయని, తాగునీటి కొరకు ప్రయాణీలకు అవస్థలు పడకుండా తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తాజీ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, ఆర్టీసి సిబ్బంది పాండు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ శివలంగం

జహీరాబాద్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో 2025 సంవత్సర క్యాలెండర్‌ను డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి, సిఐ శివలింగంలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు క్రమ శిక్షణతో కూడిన ఉన్నత విద్యను అందించాలని కళాశాల బాధ్యులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ హరికుమార్, కళాశాల డైరెక్టర్లు ఎం వెంకటరాంరెడ్డి, జి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యపకులు నందు గౌడ్, నర్సింలు పాల్గొన్నారు.

మార్కండేయ ఆలయ ప్రారంభోత్సవానికి సిఐకి ఆహ్వానం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: పట్టణశివారులోని వెంకటా పూర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన మార్కండేయ ఆలయ ప్రారంభో త్సవానికి హాజరు కావాలని ఆలయ కమిటీ బాధ్యులు సిఐ శ్రీనివాస్‌రెడ్డికి సోమవారం ఆహ్వాన పత్రికను అందచేశారు. మార్చి 3వ తారీఖు నుంచి 6వ తేదీ వరకు వైభవంగా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించన్నుట్లు, ప్రారంభోత్సవ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి హాజరై స్వామి వారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి పునీతులు కావాలని కమిటి బాధ్యులు సిఐకి వినతి చేశారు.

ప్రత్యేక తరగతులను పరిశీలించిన ప్రత్యేక అధికారి

జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

ఝరాసంగం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ప్రత్యేక అధికారి సృజన్ చక్రవర్తి పరిశీలించారు. విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రుద్రారంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

రుద్రారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్ మచ్చేందర్

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని రుద్రా రం గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని జిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుజ్జపు మచ్చేందర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మచ్చేందర్ మాట్లాడుతూ ప్రతివ్యక్తి అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాల న్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ప్రభాకర్, గ్రామస్థులు, పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారిని సన్మానించిన అధికారులు

చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వసంతకుమారిని నియ మిస్తూ జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం మండల కేంద్రమైన చౌటకూరులోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ప్రత్యేక అధికారి వసంత కుమారిని ఎంపిడిఓ శంకర్, ఎంపిఓ శ్రీకాంత్‌లు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. కార్య క్రమంలో పంచాయితీ కార్యదర్శి సందీప్‌గౌడ్, జూనియర్ సహాయకులు ప్రీతం నాయక్ తదితరులు ఉన్నారు.

వసంత కుమారిని సన్మానిస్తున్న ఎంపిడిఓ, ఎంపిఓ

నల్ల పోచమ్మ ఆలయానికి రూ. 27.12 లక్షల ఆదాయం

-మడిగెల వేలం పాట వాయిదా

కౌడిపల్లి, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని తునికి గ్రామంలో వెలసిన శ్రీనల్ల పోచమ్మ ఆలయానికి సోమవారం కొబ్బరికాయలు, మడిగెలు, వాహనాల పార్కింగ్, టెంట్ సామాగ్రి అద్దెల సం బంధించి నిర్వహించిన వేలంపాటలో గత ఏడాది మడిగెలు దక్కించుకున్న టెండర్‌దార్లు రూ. 4.70 లక్షల బాకీ వసూలు కానందున వాటికి వాయిదా వేస్తూ, మిగతావాటికి వేలం వేయగా రూ. 27.12 లక్షల ఆదాయం అమ్మవారికి వచ్చినట్లు ఇన్‌చార్జి ఈవో వి.రంగారావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరుల తో మాట్లాడుతూ దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆదేశానుసారం కూచన్‌పల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆల యం ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో వేలంపాటలు నిర్వహించినట్లు చెప్పారు.సంవత్సరం పాట కొబ్బరి కాయల విక్రయాలకుగాను చల్లా కుమార్ రూ. 18.30 లక్షలు అదనంగా పాడి దక్కించుకోగా, టెంట సామాగ్రి అద్దెకుగాను పద్మనాభం రూ. 8.45 లక్షలు అదనం గా పాడి దక్కించుకోగా, జాతర రోజుల వరకే తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయంకు ఉత్తరం, దక్షిణం దిక్కుల వాహనాల పార్కింగ్‌కు పన్యాల ఫ్రేమ్ రూ. 37 వేలకు దక్కించుకున్నట్లు ఆయన తెలిపారు. మూడు ఆంశాలకు సంబంధించి వేసిన టెండర్ల ద్వారా శ్రీ నల్ల పోచమ్మ ఆలయానికి

కొబ్బరికాయల విక్రయం, దుకాణా సముదాయం, వాహనాల పార్కింగ్‌ల వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

అదనంగా రూ. 1.32 లక్షల ఆదాయం వచ్చిందని ఆయన చెప్పారు. గత ఏడాది నాలుగు మడిగెలకు టెండర్‌దార్లు అధిక మొత్తం లో వేలంపాటలు పాడి షాపుల దక్కించుకున్న, కొంత మేర డబ్బులు ఆలయానికి బాకీ పడినందున వారు వేసిన టెండర్లను అనర్హులుగా ప్రకటించినం దున, వేరే కొత్త టెండర్లు రానందున తిరిగి వాయిదా వేసినట్లు ఇన్‌చార్జి ఈవో వి.రంగారావు తెలిపారు. గత ఏడాదికి సంబంధించి బాకీ డబ్బులు వసూలులో అధికారులు వారం రోజుల్లో చెల్లించాలని మరోసారి మౌఖికంగా అదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలి పారు. ఆలయం చుట్టుపక్కలగల పట్టాదారు భూ యజమాన్యులు ఆలయ అభివృద్ధిలో తమ వంతు కృషి చేసేందుకు గాను ప్రభుత్వ ధరకు విక్రయం చేయడం కాని, సంవత్సరం అద్దె రూపంలో గాని, విరాళా రూపంలోగాని ఆలయంకు ఇవ్వడానికి ముం దుకు రావాలని ఇన్‌చార్జి ఈవో విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆసిస్టెంట్లు వెంకట్‌రెడ్డి, రామకృష్ణా, తునికి ఆలయ మాజీ చైర్మన్లు చల్లా మల్లేశం, గోపాల్‌రెడ్డి, బండి సాయాగౌడ్, గ్రామ పెద్దలు మాణిక్యరెడ్డి, రహీం, సాయిలు, నారాయణ రెడ్డి, టెండర్‌దార్లు, ఆయ

20వ రోజుకు చేరిన డంపింగ్ యార్డు వ్యతిరేక రిలే నిరాహార దీక్షలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మండలంలోని ప్యారానగర్‌లో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు 20వ రోజుకు చేరుకు న్నాయి. స్థానిక గ్రామాల ప్రజలు, నాయకులు స్వచ్ఛందంగా ధర్నాలో పాల్గొన్నారు. గుమ్మడిదల లో పద్మశాలి సంఘం సభ్యులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కొత్తపల్లి, నల్లవల్లి గ్రామాలలో ముది రాజ్ సంఘం సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. గుమ్మడిదలలో చిన్నారులు, మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని గల్లీగల్లీ తిరుగుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వెంటనే ప్రభుత్వం ఉపసంహ రించుకోవాలని నినాదాలు చేస్తూ ఆయా గ్రామాలలో స్వచ్ఛందంగా తిరిగారు.గుమ్మడిదలలో డంపుయార్డ్ మాకు వద్దు అంటూ గులాబీల నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు సహకరించా లని గుమ్మడిదల మున్సిపల్ కమిషనర్ రఘు, డిప్యూటీ తహశీల్దార్ కరుణాకర్‌రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిలకు గులాబీ పువ్వులు ఇచ్చి మాకు సహకరించాలని కోరారు. అనంతరం దీక్ష శిబిరంలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ

డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న మహిళలు

అధ్యక్షుడు చిమ్ముల జైపాల్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, చిమ్ముల నరసింహారెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సూర్యనారాయణ, సంజీవ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, చంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, తుపా కుల రాజు, భరత్, ఆకుల ఆంజనేయులు, ఆకుల సత్యనారాయణ, సదానందరెడ్డి, రవీందర్‌రెడ్డి, బిక్ష పతిరెడ్డి, బొడ్డు చంద్రశేఖర్, భిక్షపతి, బాలిశెట్టి, నల్లవల్లి గ్రామ ప్రజలు, ముదిరాజ్ సంఘం నాయ కులు కోర్వి శంకర్, తలరి వెంకటేష్,బొడ్డు మహేష్, రాజబోయిన సత్యనారాయణ, తలారి శోభన్, గాండ్ల శ్రీశైలం, కోర్వి పోషాలు, గాండ్ల బద్రి, సందే నబోయిన శంకరయ్య, బొమ్మనిబోయిన శంకర్, జేఏసీ నాయకులు, సభ్యులు, ఆయా గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ఉమా సంగమేశ్వరాలయం ముస్తాబు

నాలుగు రోజుల పాటు జరగనున్న జాతర ఉత్సవాలు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 24 ప్రభాతవార్త: మహా శివరాత్రి జాతర ఉత్సవాలకు మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర దేవాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. అదేవిధంగా జాతర ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలు...

కొప్పోల్ దేవాలయంలో నాలుగు రోజుల పాటు మహా శివరాత్రి ఉత్సవాలను కన్నుల పండుగగా నిర్వహిస్తారు. 25వ తేదీ మంగళవారం పుణ్య హవచనం, 26న బుధవారం రుద్రాభిషేకంతోపాటు అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం, 27న గురువారం స్వామి కళ్యాణోత్సవంతో పాటు సాయంత్రం శకట భ్రమనోత్సవం, 28న శుక్ర వారం పూర్ణాహుతితో పాటు రథోత్సవ కార్యక్రమం తో జాతర ఉత్సవాలు ముగుస్తాయి.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు...

జాతర ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ నారాయణ ఖేడ్ డిపో పెద్దశంకరంపేట

బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

కట్టుదిట్టమైన భద్రత...

జాతర జరిగే నాలుగు రోజులపాటు పటిష్ట బందోబస్తులు ఏర్పాట్లు చేస్తున్నట్లు పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ తెలిపారు. జాతరలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

విత్తన ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నజిల్లా విన్సెంట్ వినయ్‌కుమార్

దుకాణాదారులు నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విత్తన ఎరువుల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవ సాయ అధికారి విన్సెంట్ వినయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం నర్సా పూర్ మండలంలోని విత్తన, ఎరువులు పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన ఎరువుల దుకాణాల యజమానులు లైసెన్సు కలిగి ఉండాలని, ఎరువులు పిఓఎస్ మెషీన్ ద్వారానే ఎమ్‌ఆర్‌పి ధరలకే విక్రయించాలన్నారు. డీలర్లు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ వారికి రిపోర్టులు అందజేయాలని, స్టాక్ రిజిస్టర్లు రోజు వారీ అప్డేట్ చేయాలని ఆదేశించారు. విక్రయాలలో డీలర్లు నిభందనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ సమయంలో జిల్లా వ్యవసాయ అధికారి విన్సెంట్ వినయ్ కుమార్ తో పాటు మండల వ్యవసాయ అధికారిణి దీపిక పాల్గొన్నారు.

నర్సాపూర్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రారంభం

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : విద్యార్థుల్లో కనీస అభ్యాసన సామర్థం పెంచేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగపడుతుందని ఎంఈఓ తారాసింగ్ అన్నారు. సోమవారం నర్సాపూంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఎంఈవో తారాసింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ తారా సింగ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక స్థాయిలో చదువుతున్న విద్యార్థు లకు ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలి పారు. ఈ మేరకు మెదక్ జిల్లాలో ఆరు ప్రాథమిక పాఠశాలను ఎంపిక చేశారు అన్నారు. ఇందులో భాగంగా నర్సాపూర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 2 లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ను ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తారా సింగ్ తో పాటు కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్, పాఠశాల హెచ్ఎం మక్సూద్ అలీ, సీఆర్పీలు సుజాత బైరవరెడ్డి. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ప్రారంభిస్తున్న ఎంఈవో తారాసింగ్ తదితరులు

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్..వృథాగా పోతున్న తాగునీరు

- వెండికోలులో 3 నెలలుగా వృథాగా తాగునీరు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ప్రజలు

చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని వెండికోలు గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకై 3 నెలలుగా తాగునీరు వృథాగా పారు తున్నా అధికారులు పట్టించుకోకపోవటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీరు వృథా కాకూడ దని చెప్పే అధికారులు మూడు నెలలుగా తాగునీరు వృథాగా పారుతున్నా పట్టించుకోకపోవడం విడ్డూరం గా ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నర్సాపూర్, గజ్వేల్, తుప్రాన్ ప్రాంత ప్రజల తాగు నీటి అవసరాలకు మండలంలోని చిక్రియాల గ్రామ శివారులో మంజీర రిజర్వాయర్‌లో ఇన్‌టెక్ వెల్‌ను నిర్మించారు. ఇన్‌టెక్‌వెల్ నుంచి హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని నీటి శుద్ధి కేంద్రం వరకు భారీ పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి జలాలను తరలి

వెండికోల్ గ్రామంలో మంజీర పైల్‌లైన్ లేకేజితో పారుతున్న నీటి దృశ్యం

స్తున్నారు. వెండికోలు గ్రామ శివారులో మూడు నెలల క్రితం పైప్‌లైన్ లీక్ కావడంతో తాగు నీరు రోడ్డు పాలవుతోంది. నీరు వృథాగా పారుతున్నా సంబం ధిత అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకవుతున్న పైప్‌లైన్‌కు మర మ్మతులు చేయించి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులకు సూచిస్తున్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

హాజరైన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని కౌలంపేటలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ 17వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవ కమటీ నిర్వాహకులు గోశిక అనసూయ వెంకటేశం, గోసిక ఉజ్వల రాజశేఖర్, గోశిక లయ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను సాదరంగా స్వాగతంపలికి ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటిసి సభ్యులు కొండలరెడ్డి, నాయకులు చిక్కుల మల్లేశం, డాక్టర్ శ్రీహరి, శంకర్ గౌడ్, జలంధర్, శ్రీకాంత్, ఆలయ కమిటి బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వరి పంటలను పరిశీలించిన శాస్త్రవేత్త

పుల్‌కల్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఇసోజీపేట గ్రామంలో రైతులు సాగు చేస్తున్న వరి పంటను ఏరుకవాక కేంద్రం సంగుపేట్ రాహుల్ విశ్వకర్మ శాస్త్రవేత్త వరి పంటను పరిశీలించారు. పంటకు సోకిన చీడపీడలు, తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. పంటో కాండం తొలుచు పురుగు సోకిన లక్షణాలు కానవచ్చాయని శాస్త్రవేత్త రైతులకు సూచించారు.కాండం తొలుచు పురుగు తెగులు నివారణకు ఎకరానికి కార్పోప్యరాన్ 3 గ్రాముల గుళికలు 10 కిలోల ఇసుకలో కలిపి సమానంగా చల్లాలన్నారు. ఉధృతిని బట్టి ఎకరా భూమిలో 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలన్నారు. పురుగు ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రోక్లోరైడ్ పురుగు మందును 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎడబ్లు ఈపి విద్యార్థులు అఖిల, జయసూర్య, రైతులు వెంకటేశం, రాము, డిఎఎటిటిసి వైపి-1 శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డును పరిశీలించిన డిపిఓ

వెండికోలులో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డిపిఓ సాయిబాబా

చౌటకూరు, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని వెండికోలు గ్రామాన్ని జిల్లా పంచాయితీ అధికారి సాయిబాబా సోమవారం పరిశీలిం చారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించి పరిశుభ్రతను పరిశీలిం చారు. నాటిన మొక్కలు, డంపింగ్ యార్డులో వర్మీకంపోస్ట్ తయారిని పరిశీ లించారు. గ్రామ పంచాయితీలో పంచాయితీ రికార్డులను పరిశీలించి ఎంపిఓ శ్రీహరి, పంచాయతీ కార్యదర్శి రంజిత్‌కుమార్‌కు పలు సూచనలు చేశారు.

ఖేడ్‌లో కొనసాగుతున్న పోస్టల్ కార్డుల ఉద్యమం

ఖేడ్‌లో కొనసాగుతున్న పోస్టల్ కార్డుల

నారాయణఖేడ్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా చేసిన హామిలో భాగంగా విద్యార్థులకు ఎలక్ట్రిక్ స్కూటీ హామిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నియోజవర్గంలో కాంగ్రెస్ జాతీయ నాయకురాలు ప్రియాంకగాంధీకి విద్యార్థులు పోస్టల్ ఉత్తరుల పంపుతున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి కుమార్తె టిఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహారెడ్డి శ్రేయరెడ్డి, నాయకులు అశోక్‌రెడ్డి, మండల యూత్ పార్టీ అధ్యక్షుఉలు మచ్చేందర్, చింటూ నరేష్, గౌరీ ప్రసాద్, సాయి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంకు శివస్వాముల పాదయాత్ర

అల్లాదుర్గం, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త: మండల కేంద్రం నుంచి సోమ వారం శివస్వాముల ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌జిల్లాలోని భ్రమరాంబ సమేతంగా కొలువున్న శ్రీమల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శివస్వాములు పాద యాత్రగా పయనమయ్యారు. అల్లాదుర్గంలోని శ్రీలక్ష్మినరసింహస్వామి ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడిలను కట్టుకుని పరమేశ్వ రుడిని స్మరిస్తూ శ్రీశైలంకు బయలెక్కారు. గురుస్వామి సదానందం ఆధ్వర్యంలో 12 మంది శివస్వాములు పయనమవ్వగా కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బలరాం, శివస్వాములు రమేష్, దుర్గయ్య, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

8వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

దీక్షలో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్, డైరక్టర్లు

నర్సాపూర్, ఫిబ్రవరి 24, ప్రభాతవార్త : పట్టణానికి నష్టం కలిగించే డంపు యార్డును ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని నర్సాపూర్ పిఎసిఎస్ చైర్మన్ రాజుయాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్యారానగర్‌లో నిర్మి స్తున్న జిహెచ్‌ఎంసి డంప్‌యాడ్‌కు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలో రాజుయాదవ్ పాల్గొన్నారు. సోమవారంతో నర్సాపూర్‌లో నిర్వహిస్తున్న దీక్షలు 8వరోజుకు చేరుకుంది. ఈరోజు నిర్వహించిన దీక్షలో నర్సాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజు యాదవ్ ఆధ్వర్యంలో పిఎసిఎస్ డైరెక్టర్లు ఈ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ అడవి ప్రాంతంలో ఈ డంపు యార్డు నిర్మించినట్లయితే నర్సాపూర్‌కు ఎక్కువ నష్టం వాటిల్లుతుందని, అదేవిధంగా వాతావరణం మొత్తం కరిషితమవుతుందని అన్నారు, దీంతో ఇక్కడి ప్రజలకు ఎంతో నష్టం కలుగుతుందన్నారు. ప్రజలకు వాతావరణానికి ముప్పు కలిగించే ఈ డంపు యార్డును ప్రభుత్వం వెంటనే ఈ డంపింగ్ యార్డ్ ను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్ తో పాటు డైరెక్టర్లు కమ్మరి కృపాచారి, రవి గౌడ్, మురళీధర్, రూప్ల, కుమ్మరి నగేష్. లాయర్ ఆనంద్ కుమార్, అఖిలపక్షం నాయకులు గోడ రాజేందర్. మిర్యాల చంద్రశేఖర్. సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎమ్మెల్సీ కాంగ్రెస్‌దే

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 24,ప్రభాతవార్త: రాబోయే ఎమ్మెల్సీ పట భద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌నాయక్, రాజ్‌కుమార్‌గౌడ్ ఉదయ్, ప్రవీణ్, అక్బర్‌లు అన్నారు. సోమవారం చిన్నశంకరంపేటలో